క్లుప్తంగా

8 నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు

ఇంద్రవెల్లి: ఈనెల 8 నుంచి పీఏసీఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె గురువారం తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.1962 ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పంట అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 30 రోజుల పాటు బ్యూటీపార్లర్ ఉచిత శిక్షణ కేబీ కాంప్లెక్స్ ఆర్‌సెటీలో నిర్వహించడం జరుగుతుందని సంస్థ డైరెక్టర్ లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫాం, టూల్ కిట్లు, బస్సు చార్జీలు అందించడం జరుగుతుందన్నారు. 18 నుంచి 45 లోపు వయస్సు కలిగి పది పాస్/ ఫెయిల్ యువతులు, మహిళలు సంప్రదించాలన్నారు. వివరాలకు 99494 12159, 80960 93085 సంప్రదించాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

బోథ్: తమ వేతనాలకు అదనంగా రూ.1000 పెంచినందుకు బోథ్ మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్, వార్డు సభ్యులు గోపి, గంగయ్య, సుధీర్, రాజు, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన ఆదివాసీ నాయకులు



కోర్టు వద్ద నాయకులు

బోథ్: ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని ఉద్యమం చేసిన ఆదివాసీలపై గతంలో కేసులు నమోదు కాగా.. గురువారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించే వరకు పోరాడుతామన్నారు. కోర్టుకు హాజరైన వారిలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కొడప నగేశ్, రామెల్లి భోజన్న, ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి ఉన్నారు.

ప్రాజెక్టులో పెరిగిన నీటి మట్టం



మత్తడి వాగు ప్రాజెక్టు

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టు నీటిమట్టం గురువారం స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో సాయంత్రం కురిసిన వర్షానికి వరదనీరు వచ్చి చేరింది. గత వారం రోజుల క్రితం వరకు ప్రాజెక్టులో నీటి మట్టం 273.50 మీటర్ల ఉండగా వరుసగా కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం నీటిమట్టం 274.30 మీటర్లకు చేరుకున్నట్లు ప్రాజెక్టు ఏఈ హరీష్ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్: ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఎండలతో అప్రమత్తంగా ఉండాలని బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది, రంగపేట గ్రామాల్లో పనుల ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. కూలీలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పెట్టెం చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్పంచుల సంఘీభావం

కడెం: జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గురువారం కడెం మండల సర్పంచులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కడెం మండల సర్పంచ్‌ల ఫోరం నుంచి రూ.12వేలు అందించినట్లు సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు గొర్ల వేణుగోపాల్ తెలిపారు.

వాహనాలతో జాగ్రత్త

- పిల్లలకు ఇవ్వొద్దని సూచిస్తున్న పోలీసులు
- ప్రమాదం జరిగితే వాహన యజమానిపై కేసు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నేరడిగొండ: వేసవి సెలవులు వచ్చేశాయి.. ఇక పిల్లలు సరదా కోసం ఇంట్లోని ద్విచక్ర వాహనాలతో దూసుకెళ్దామని అనుకుంటారు. తల్లిదండ్రులు పోనీలే అని వదిలేస్తే ఇబ్బందులు తప్పవు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే సమయంలో తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచిస్తున్నారు.

ప్రమాదం జరిగితే అంతే..

మైనర్లు వాహనాలు నడిపే సమయంలో అనుకోకుండా రోడ్డు ప్రమాదం జరిగి కేసు నమోదు చేస్తే చట్టపరంగా బాధితులకు రావాల్సిన ఎలాంటి బెనిఫిట్స్ వర్తించవు. వాహన బీమా ఉన్నప్పటికీ దానిని క్లెయిమ్ చేయలేని పరిస్థితి.

శిక్ష తప్పదు..

వాహనాలు నడిపే పిల్లలపై కోర్టుల్లో నేరాభియోగపత్రం దాఖలు చేస్తారు. దీంతో కనీసం రెండు నుంచి ఏడు రోజుల వరకు పరిశీలన గృహానికి (జువైనల్ హోం) తరలిస్తారు. వారికి వాహనాలిచ్చిన తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తున్నారు. వారికి శిక్ష తప్పదు.

తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో బైక్‌లు, కార్లు, ఆటోలు ఇవ్వొద్దు. ఎక్కువగా సైకిల్ వాడే విధంగా చూడాలి.
- వాహనం తాళం పిల్లలకు కనిపించకుండా జాగ్రత్తగా భద్రపర్చాలి.
- పిల్లలకు పోలీసులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

మీకు తెలుసా..

- 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే రోడ్డుపై వాహనం నడిపేందుకు చట్టం అనుమతిస్తుంది.
- దేశ వ్యాప్తంగా ఏటా 11 శాతం రోడ్డు ప్రమాదాలు మైనర్లు వాహనాలు నడపడంతోనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

తనిఖీలు చేపడుతున్నాం



సరదా కోసం తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న తర్వాత వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నవారే వాహనాలు నడపాలి. వేసవి సెలవుల్లో పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా చూడాలి. ప్రస్తుతం వాహనాల తనిఖీలు చేపడుతున్నాం.

నైలు, ఇచ్చోడ సర్కిల్ సీఐ

మొక్కజొన్నకు మొలకలు



మొలకలు వచ్చిన మొక్కజొన్న



తడిసిన పంటను చూపుతున్న రైతు

తాంసి: అకాల వర్షాలతో రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. కోతకు వచ్చిన పంటలు తడిసిపోవడంతో మొలకెత్తుతున్నాయి. తాంసి, భీంపూర్ మండలాల్లో ఇప్పటికే వర్షాల వలన జొన్న, నువ్వు, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. పొన్నారి గ్రామానికి చెందిన అండే ఆనంద్ నాలుగు ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న తడిసి పోవడంతో మొలకెత్తాయి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

బుద్ధ జయంతి విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల బుద్ధ విహార్‌లో శుక్రవారం నిర్వహించే బుద్ధ జయంతికి విజయవంతం చేయాలని అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్ పిలుపునిచ్చారు. గురువారం జరిగిన ప్ర శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత నెల 30 నుంచి సైనికులకు ప్ర శిక్షణ కొనసాగుతుందన్నారు. బుద్ధ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌లు పాల్గొనున్నట్లు తెలిపారు.

కమీషన్ తీసుకున్న ఎమ్మెల్యేల పేర్లు బహిర్గతం చేయాలి



మాట్లాడుతున్న కొత్తూరి లక్ష్మణ్

ఇచ్చోడ: దళితబంధులో కమీషన్ తీసుకున్న ఎమ్మెల్యేల పేర్లను సీఎం కేసీఆర్ బహిర్గతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఎస్సీసెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం ఇచ్చోడ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గంలో దళితుల నుంచి రూ. 2 నుంచి 3 లక్షల వరకు కమీషన్లు వసూల్ చేశారని ఆయన ఆరోపించారు. దళితబంధు బీఆర్ఎస్ నాయకులకు రాబంధుల పథకంగా మారిందన్నారు. కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేలు వారి అనుచరుల పేర్లను వెంటనే బహిర్గతం చేసి దళితులను రక్షించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కల్లెం నారాయణ్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తాఫా, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

నార్నూర్: హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభ పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీఎస్పీ మండలాధ్యక్షుడు మహూర్కర్ నవీన్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బీఎస్పీ నిరంతరం పోడుతుందన్నారు. ప్రభుత్వం పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివాజీ లోఖండే, ప్రమోద్ ఝాడే, చునార్కర్ రాజశేఖర్, మస్కే సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు తెలంగాణ భరోసా సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ.. ఈనెల 7న హైదరాబాద్‌లో తెలంగాణ భరోసా సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెగ్గర్ల అరవింద్, గొంటిముక్కుల ప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.

బుక్ కీపర్లను నియమించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు వందన

కైలాస్‌నగర్: ఐకేపీ వీవోఏల సమ్మె నేపథ్యంలో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల నిర్వహణకు అటంకం కలుగకుండా ఓ మహిళను బుక్ కీపర్‌గా నియమించుకుని, వారికి శిక్షణనందించాలని జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఎం.వనజ సూచించారు. సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వీఓఏల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఆడిట్‌కు అభ్యంతరాలు లేకుండా వారి వద్ద ఉన్న బుక్స్‌ను సంఘాలకు అప్పగించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రమీళ, కోశాధికారి డి.గోకుల, ఐబీ డీపీఎం టి.హేమలత, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది సోయాబీన్ విక్రాంత్ సీడ్స్‌ను కొని లక్షల రూపాయలు రైతులు నష్టపోయారని తెలిపారు. ఇందుకు సంబంధించి రైతులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం రాలేదన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, డీలర్లకు తగు సూచనలు జారీ చేయాలని డీఏవోకు విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమనవేని వెంకట్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దీపక్ రావు, తుడం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం



కోతకు గురైన రోడ్డు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో గురువారం సాయంత్రం పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండలంలోని అసోదా, బుర్కి గ్రామాల శివారు అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి అంకాపూర్ వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. కొన్ని గంటల పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వరద నీటి ప్రవాహానికి వంతెన కోతకు గురైంది.

కళాశాలలో మందుబాబుల ఆగడాలు



కళాశాల ఆవరణలో బీరు సీసాలు

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మందుబాబులు ఆగడాలు మితిమీరిపోతున్నాయి. కళాశాల ఆవరణలో, మైదానంలో పలువురు మద్యం సేవిస్తున్నారు. మద్యం బాటిళ్లను కళాశాల ఆవరణలోనే పడేస్తున్నారు. గురువారం ఉదయం వాకింగ్‌కు వచ్చిన వారు మద్యం బాటిళ్లను చూసి విస్తుపోయారు. చదువు చెప్పే కళాశాలలో మద్యం సేవించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను నిర్వహించాలని కోరుతున్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు పెందోర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా.. కనీస వేతనం వేతనం రూ. 26 వేలు, పది లక్షల ఆర్యోగ బీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమోసే వెంకట్‌రావ్, కాంబ్లే దిలీప్, వీవోఏలు షేక్ ఫెరోజ్, కోట్నాక్ భారిక్‌రావ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పడిపోతేగాని పట్టించుకోరా?



తలమడుగు: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో పంట పొలంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఈదురు గాలులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: విద్యుత్‌శాఖ ఏఈ, సతీశ్, ఫోన్: 90145 24827

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఆదిలాబాద్‌అర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం అనువైన స్థలాలను ఎంపిక చేయాలని టీయూడబ్ల్యూజే (ఏ143) యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్యే జోగు రామన్నను కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఇళ్ల స్థలాల గురించి చర్చించి, వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పట్టణ శివారులోని బట్టిసావర్‌గాం, మావల పరిధిలో అనువైన స్థలాలు పరిశీలించి నివేదిక అందించాలని గతంలోనే అధికారులను ఆదేశించినట్లు తెలిపాఉ. జిల్లా కలెక్టర్‌తో చర్చించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీపురం రాజు, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

ఘనంగా సాజిద్‌ఖాన్ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌అర్బన్: డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ జన్మదిన వేడుకలను గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆయన నివాసంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల నాయకుడు సాజిద్‌ఖాన్ అని, ఆపత్కాలంలో కాంగ్రెస్‌కు అన్ని తానై ముందుకు నడిపిస్తున్న నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు



పాల్గొన్న భక్తులు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో అదే గ్రామానికి చెందిన రైతు వెల్మ లింగారెడ్డి దంపతులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అడెల్లి పోచ్చమ్మ, భూ నాంచారమ్మ ఆలయాలను నిర్మించారు. గత మూడు రోజుల నుంచి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనిసాగుతున్నాయి. గురువారం అడెల్లి పోచ్చమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, యజ్ఞం, హోమం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ప్రత్యేక పూజలు చేశారు. వెల్మ లింగారెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత రెండు సంవత్సరాల నుంచి ఆలయ నిర్మాణానికి అహర్నిశలు కష్టపడ్డారని అన్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ మున్సిపాల్ చైర్మన్ రంగినేని మానిషా, సర్పంచ్ మొట్టె వెంకటమ్మ, కిరణ్ కుమార్, దేవరెడ్డి, నారాయణరెడ్డి, జైభరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల దేవతలకు పూజలు



పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో కుల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెర్సపేన్, భీమల్‌దేవ్, జంగుబాయి దేవతలకు పూజలు చేసి మొక్కులు సమర్పించారు. గురువారం మండలంలోని కేస్లాపూర్ ఉర్వేత వంశీయులు, కేస్లాగూడలో హెరేకుమ్ర వంశీయులు, చిలటిగూడలో మడావి వంశీయులు పూజలు చేశారు. కొత్తగా పెళ్లిలు అయిన తమ వంశంలోని కొత్త కోడళ్లకు దేవత దర్శనం చేయించి బేటింగ్ (పరిచయం) పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పెర్సపేన్ దేవతను ఊరేగిస్తున్న ఆదివాసీలు



నృత్యం చేస్తున్న మహిళలు